సాక్షి
సిద్దిపేట
సోమవారం । 5 । ఆగస్టు । 2024



గురుకులంలో కష్టాలు

గురుకులాలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



తీరనున్న తిప్పలు

నారాయణఖేడ్ ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి. జహీరాబాద్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) పరిధిలోకే ఖేడ్ నియోజకవర్గం రానుంది.

వివరాలు 8లో ▸

నేటి నుంచి శ్రావణమాసోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసం సోమవారం నుంచి నెల రోజుల పాటు కొనసాగనుందని ఆలయాల అర్చకులు, నిర్వాహకులు ఆదివారం తెలిపారు. శ్రావణమాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలోనే అనేక పండుగలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లా కేంద్రంలోని అన్ని ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

మొక్కలు నాటిన గోల్డ్ వాకర్స్



మొక్కను నాటుతున్న సభ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్డ్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా వాకింగ్ చేస్తున్నామని, తామంతా మిత్రులమని అన్నారు. మా స్నేహానికి గుర్తుగా మొక్కలు నాటి కాపాడాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, దుబ్బరాములు, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, మదన్, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, సత్యం, కత్తి శ్రీను, శ్రీధర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన మోర్చా అధ్యక్షుడిగా భిక్షపతి



భిక్షపతి నాయక్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ధూళ్మిట్ట మండలానికి చెందిన ధారావత్ భిక్షపతి నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం నియామక పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అందించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమారాణి, మీడియా సెల్ కన్వీనర్ గోనె మార్కండేయులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీనామా



మల్లికార్జున్

గజ్వేల్: టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) సిద్దిపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పదవికి మల్లికార్జున్ రాజీనామా చేశారు. ఆదివారం తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డికి అందజేశారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయం, బదిలీల సందర్భంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై టీపీటీఎఫ్ సరైన విధంగా స్పందించకపోవడం వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు మల్లికార్జున్ రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. ఈ సంఘటన ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



పుట్ల ఏసును సన్మానిస్తున్న నాగరాజు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజాసంక్షేమం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని, డీసీసీ జనరల్ సెక్రటరీ ఎం.నాగరాజు యాదవ్ అన్నారు. పార్టీ ఎస్సీ విభాగం జిల్లా వైస్ చైర్మన్‌గా నియామకమైన పుట్ల ఏసును ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. నాగరాజు మాట్లాడుతూ రైతుల రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మకమని, దీంతో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడం ద్వారా నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయన్నారు. నిరుపేదలకు త్వరలోనే ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తారన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమాకు నేడు ఆఖరు

దుబ్బాకటౌన్: రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి గోవింద రాజు అన్నారు. ఆదివారం రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.



వినూత్నం.. వివేకం

పర్యావరణంపై చిన్నారులు వినూత్న రీతిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్లోబల్ వార్మింగ్ విపరీతంగా పెరిగిపోతున్న ప్రస్తుత నేపథ్యంలో చెట్ల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చిన్నారులు ఒక తొట్టిలో మొక్కను ఉంచి దాని ద్వారా ప్రాణవాయువు అందుతున్నట్లు మాస్క్‌ను ధరించి అవగాహన కల్పించడం చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియను పట్టణంలోని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

–సిద్దిపేటజోన్

పచ్చదనం.. ఏదీ కొత్తదనం?

- వినూత్న కార్యక్రమాల కొనసాగింపు లేనట్లేనా?
- ప్రయోగాలకు స్వస్తి పలికిన అధికారులు
- కనిపించని 'మియావాకీ', ఏఆర్, ఏఎన్ఆర్ కార్యక్రమాలు
- గజ్వేల్‌లో పైలెట్ ప్రాజెక్ట్‌తో మంచి ఫలితాలు
- ఏళ్లు గడుస్తున్నా ముందుకుసాగని కార్యాచరణ
- 'వనమహోత్సవం' వేళ.. తెరపైకి అంశం

పచ్చదనం.. త్వరగా విస్తరించడానికి ఉద్దేశించిన వినూత్న కార్యక్రమాలు కొంత కాలంగా అమలుకు నోచుకోవడంలేదు. గతంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద గజ్వేల్ ప్రాంతంలో చేపట్టిన 'మియావాకీ', కృత్రిమ అడవుల పునరుత్పత్తి (ఏఆర్), సహజ అడవుల పునరుత్పత్తి పథకాలతో (యాడెడ్ నేచురల్ రీ–జనరేషన్) మంచి ఫలితాలు వచ్చాయి. నిధుల కొరతా..? లేదా ఇతర కారణాలా..? తెలియదు కానీ అద్భుత ఫలితాలనిచ్చే ఈ వినూత్న కార్యక్రమాల కొనసాగింపు ఆగిపోయి అటవీ శాఖలో స్తబ్దత నెలకొనడం చర్చనీయాంశంగా మారుతోంది. ఊరువాడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్న ప్రస్తుత తరుణంలో ఈ అంశం తెరపైకి వస్తున్నది. –గజ్వేల్



కోమటిబండ గుట్ట వద్ద ఏఆర్ కార్యక్రమం ద్వారా కొత్తగా సృష్టించిన అడవి ఇదే

అటవీ శాఖలో ఏడేళ్ల క్రితం వినూత్న కార్యక్రమాలు కొనసాగాయి. ప్రత్యేకించి మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ ప్రాంతం ఈ కార్యక్రమాలకు వేదికైంది. గజ్వేల్ అటవీశాఖ రేంజి పరిధిలోగల 7,386 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. గతంలో ములుగు మండలం నర్సంపల్లి, వర్గల్ మండలం సింగాయపల్లి, గజ్వేల్ మండలం కోమటిబండ, రంగంపేట అటవీ ప్రాంతాల్లో 2287 హెక్టార్లలో సహజ అడవుల పునరుత్పత్తి(యాడెడ్ నేచురల్ రీ–జనరేషన్), కృత్రిమ అడవుల పునరుత్పత్తి (ఏఆర్) పథకాల ద్వారా అడవుల్లో పెద్ద ఎత్తున మొక్కలను పెంచి మంచి ఫలితాలను తీసుకువచ్చారు. 22ఏప్రిల్ 2018న ఈ కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రత్యక్షంగా పరిశీలించి తమ జిల్లాల్లో అమలు చేసే విధంగా చొరవ చూపాలని ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ... కలెక్టర్లంతా ఇక్కడ పర్యటించిన సంగతి తెలిసిందే.

సింగాయపల్లి అడవిలో ఖాళీ ప్రదేశాలు కనిపించడం చూసి ఇక్కడ కూడా మొక్కలు నాటి అడవి సాంద్రత పెంచాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జపాన్‌లో మియావాకీ అనే శాస్త్రవేత్త కొన్నేళ్ల క్రితం ప్రవేశపెట్టిన విధానాన్ని అమలు చేశారు. ఇందులో భాగంగానే అడవి మధ్య భాగంలో ఖాళీగా ఉన్న 5హెక్టార్ల భూమిని ఎంపిక చేసి అడవి సాంద్రతను పెంచారు. సాధారణ పద్ధతిలో అయితే 50 హెక్టార్లలో నాటే 50వేల మొక్కలను నాటుతారు. కానీ 50వేల మొక్కలను 5హెక్టార్లలోనే నాటడమే 'మియావాకీ' విధానం ప్రత్యేకత. మొక్కకు మరో మొక్కకు మధ్యన మీటర్ దూరం మాత్రమే వదిలి మొక్కలను నాటుతారు. ఈ పద్ధతి ద్వారా సింగాయిపల్లి అడవిలో మొక్కలను పెంచి, అడవి సాంద్రతను పెంచారు. ఇకపోతే గజ్వేల్ మండలం కోమటిబండలోని మిషన్ భగీరథ హెడ్ వర్క్స్ వద్ద గుట్ట చుట్టూ నాలుగేళ్లల్లో 2.5కిలోమీటర్ల ప్రాంతంలో కృత్రిమ అడవుల పునరుత్పత్తి (ఏఆర్) పథకం ద్వారా కొత్త అడవిని సృష్టించారు. పచ్చదనం విధ్వంసమైన ఈ ప్రాంతంలో నెమళ్లు, ఇతర వన్యప్రాణులు రోడ్ల పైకి వచ్చి వందల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. ఈ పరిస్థితిని మార్చడానికి 2015–16నుంచి 2019–20వరకు 702హెక్టార్లలో కోటి మొక్కలను నాటి కొత్త అడవిని సృష్టించారు. దీనివల్ల ప్రస్తుతం ఈ అడవుల్లో చాలా కాలంగా కనిపించకుండాపోయిన కొండ గొర్రెలు, తోడేళ్లు, హైనాలే కాకుండా కుందేళ్లు, నెమళ్లు, కోతులు ఇలా ఒకటేమిటీ అన్ని రకాల వన్యప్రాణులు విరివిగా తిరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలన్నీ స్వల్ప కాలంలో మంచి ఫలితాలనిచ్చాయి. ఈ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ కార్యక్రమాల కొనసాగింపు కనిపించక అటవీశాఖలో స్తబ్దత నెలకొన్నది. ఇవేకాకుండా ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని వర్ధిల్లుతున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను ఆనుకున్న అటవీ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ మార్చే ప్రతిపాదన, హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న గజ్వేల్ అర్బన్ పార్కును మరింతగా అభివృద్ధి చేసే అంశాలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి.

భారీఎత్తున అమలు చేశాం

జిల్లాలో ఏఆర్, ఏఎన్ఆర్‌తో మియావాకీ విధానాల ద్వారా అడవుల విస్తరణ చాలా వరకు జరిగింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఈ కార్యక్రమాలపై ఆలోచిస్తాం. మియావాకీ విధానాన్ని ప్రతి పల్లె ప్రకృతి వనంలో అమలు చేశాం. ఏరియా తక్కువగా ఉన్న చోట మాత్రమే ఈ విధానం అమలుకు అనుకూలంగా ఉంటుంది.

–శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి

ప్రతి పల్లె మెరవాలి



మంత్రి పొన్నంకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను కడుతున్న కౌన్సిలర్

స్వచ్ఛదనం- పచ్చదనం సక్సెస్ చేద్దాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- క్యాంప్ కార్యాలయంలో స్నేహితుల దినోత్సవం
- ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి పూజలు

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు క్యాంప్ కార్యాలయంలో స్నేహితుల దినోత్సవం వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు మంత్రికి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు పల్లెల్లో, పట్టణాల్లో పరిశుభ్రత, కాలుష్యం నివారించడం, చెట్లను పెంచడం కోసం స్వచ్ఛదనం- పచ్చదనం చేపడుతున్నామన్నారు. ప్రతి తెలంగాణ బిడ్డ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మన జీవన విధానంలో ఇది భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంతో అన్ని గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, వార్డులు మెరవాలని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, పున్న లావణ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిడ్‌మానేరుకు నీరు విడుదల

- ఫలించిన హరీశ్‌రావు లేఖ
- ఆయా కట్టు రైతుల హర్షం

సిద్దిపేటజోన్: ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ ఫలించింది. జిల్లాలో అడుగంటుతున్న రిజర్వాయర్లలోకి మిడ్ మానేరు ద్వారా గోదారి నీటిని పంపింగ్ చేసి రైతులను ఆదుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం విదితమే. ఈ మేరకు ఆదివారం సంబంధించిన నీటిపారుదల చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పందించి హరీశ్ రావుతో మాట్లాడారు. సోమవారం నుంచి నీటిని పంపింగ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రకటనతో జిల్లాలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కస్తూర్బాలో వసతులు కల్పిస్తా

- రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి
- జగదేవ్‌పూర్‌లో కేజీబీవీ సందర్శన
- సొంత గ్రామంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వెంకటనర్సింహారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కేజీబీవీని సందర్శించారు. ముందుగా విద్యార్థినులతో మాట్లాడి పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. ప్రహరీ లేదని, విద్యుత్, తాగునీటి సమస్య, గదుల కొరత ఉందని విద్యార్థినులు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని తెలిపారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓ వైపు చదువుపై మరో వైపు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థినులకు సూచించారు.

మీ పిల్లల బాధ్యత మాదే..

విద్యార్థినుల తల్లిదండ్రులతో విద్యాశాఖ డైరెక్టర్ మాట్లాడారు. మీ పిల్లల భవిష్యత్ మాపై ఉందని చెప్పారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలతో పాటు విద్యను అందించడం జరుగుతుందన్నారు. నా సొంత ఊరు జగదేవ్‌పూర్‌లో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జీసీఈడీఓ ముక్తేశ్వరి, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీఎస్ గోవర్ధన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం..



మూలిక మొక్కలతో యోగా శిక్షకులు తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మొక్కలను విరివిగా పెంచి పర్యావరణం రక్షిద్దామని, యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవిద్దామని జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ అన్నారు. మూలికల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో ఆదివారం ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన సమాజాన్ని అందించాలంటే మొక్కల పెంపకం కీలకమన్నారు. పుట్టినరోజులు, వివాహ ఉత్సవాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరం మొక్కలను పెంచుతామని , వృక్షాలను రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ యోగ విద్యను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యుడు తోట సతీష్, పతంజలి యోగా సమితి చీఫ్ పాట్రన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక'ంగా సత్తా చాటుదాం

- సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



బీసీ సెల్ మండలాధ్యక్షుడికి నియామకపత్రాన్ని అందిస్తున్న నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని, విజయమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సూచించారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో యువజన కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. మండల బీసీ సెల్ కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా తిగుల్ గ్రామానికి చెందిన లోకేష్ నియమితులయ్యారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యువజన కాంగ్రెస్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీనియర్‌నాయకులు నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల ప్రవీన్, అశోక్, మహేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల మరో ముందడుగు

- నూతనంగా మూడు పీజీ కోర్సులు మంజూరు
- మొత్తం 16 కోర్సుల్లో 72 సీట్లు
- మెడికల్ హబ్‌గా జిల్లా



సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల

సిద్దిపేటకమాన్: మెడికల్ హబ్‌గా జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. విద్య, వైద్య రంగంలో మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటైన కొన్నేళ్లలోనే పీజీ సీట్లను కేటాయించడం.. ప్రస్తుతం మరిన్ని కోర్సులను నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఇప్పటికే 13 కోర్సుల్లో 58 సీట్లు ఉన్నాయి. వీటికి తోడు ప్రస్తుతం మరో మూడు కోర్సుల్లో 14 సీట్లను మంజూరు చేసింది. నూతనంగా అనస్థీషియా విభాగంలో ఆరు సీట్లు, పిడియాట్రిక్ విభాగం 4సీట్లు, డెర్మటాలజీ విభాగం 4సీట్లు మంజూరు కావడంతో మొత్తం 16 పీజీ కోర్సుల్లో 72 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ సమయంలో ఎక్కువ సంఖ్యలో సీట్లు అందుబాటులోకి రావడంతో మెడికల్ కళాశాలకు అరుదైన గుర్తింపు అని, ఇది రికార్డు అని వైద్యాధికారులు చెబుతున్నారు.

హరీశ్‌రావు చొరవతోనే..

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతోనే ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. 2019–20లో మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులు (175మంది) అడ్మిషన్ పొందారు. వారంతా ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేసి ఇటీవలే కాన్వకేషన్ డే నిర్వహించి పట్టాలు పొందారు. ప్రస్తుతం కళాశాలలో నాల్గో బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వైద్య కోర్సును అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నిర్మించిన జనరల్ ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. పెద్ద ఎత్తున పీజీ సీట్లు మంజూరు కావడంతో వైద్య విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏన్సాన్‌పల్లి శివారులో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

చాలా సంతోషకరం



గత ప్రభుత్వంలో ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాల రికార్డు సాధించింది. స్వల్ప కాలంలోనే 16 కోర్సుల్లో 72 పీజీ సీట్లు అందుబాటులోకి సంతోషకరం. పీజీ కోర్సు చదవాలనుకునే వైద్య విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పనున్నాయి. స్థానికంగానే పీజీ కోర్సులు పూర్తి చేసే అవకాశం ఏర్పడింది.

– హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఇచ్చిన డబ్బులు అడిగినందుకు..

యువకుడిపై కత్తితో దాడి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగినందుకు యువకుడిపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. ఆత్మకూర్ గ్రామానికి చెందిన బసవపురం నరేశ్ గ్రామంలో హోటల్ నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. అదే గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహించే అరెకటికే రాహుల్ నరేశ్ వద్ద ఏడాది కిందట రూ.7,500 అప్పుగా తీసుకున్నాడు. చాలాసార్లు డబ్బులు తిరిగి ఇవ్వమని నరేశ్ అడిగినా ఇవ్వలేదు. ఆదివారం ఉదయం హోటల్ ఎదుట నుంచి రాహుల్ వెళ్తుండగా డబ్బులు ఇవ్వమని అడుగడంతో ఇద్దరి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో చికెన్ నరికే కత్తితో రాహుల్ నరేశ్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అతడిని కుటుంబ సభ్యులు సదాశివపేటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేశ్వర్ రావు తెలిపారు.

మూడు గంటల్లో మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన ఇద్దరు ముస్లిం బాలికలు ఆదివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండానే వెళ్లిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వారి ఫోన్ ట్రాక్ చేశారు. హుటాహుటినా వారు ఉన్న స్థలాన్ని కనుక్కొని పట్టుకున్నారు. మూడు గంటల వ్యవధిలోని కేసు ఛేదించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

లారీని ఢీకొట్టిన బైక్

ఇద్దరు యువకులకు గాయాలు


లారీ కింద బైక్

నర్సాపూర్ రూరల్: లారీని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నిమ్మగళ్ల ప్రభు, నిమ్మగళ్ల చిన్నలు నర్సాపూర్ నుంచి తిరిగి బైక్ పై స్వగ్రామానికి వెళ్తున్నారు. నర్సాపూర్ అంబేడ్కర్ చౌరస్తా సిగ్నల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బస్సును ఢీకొని యువకుడు మృతి


బస్సు కిందికి దూసుకెళ్లిన బైక్

దుబ్బాకరూరల్: ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వస్తుంది. సిద్దిపేట నుంచి ఎదురుగా వస్తున్న బైక్ బస్సును ఢీకొట్టడంతో పురుషోత్తం(32)అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది స్వగ్రామం మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామంగా గుర్తించారు. మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..

శివ్వంపేట(నర్సాపూర్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధి చెన్నాపూర్ గ్రామానికి చెందిన గుమ్మల ఆంజనేయులు(40) మద్యానికి బానిస కావడంతో శనివారం భార్య ఎల్లమ్మ నిలదీసింది. దీంతో కోపోద్రేకుడై ఆమెను కొట్టాడు. ఎల్లమ్మ తిమ్మాపూర్‌లోని ఆడపడుచు ఇంటికి వెళ్లింది. మద్యం మత్తులో ఆంజనేయులు పురుగుల మందు తాగడంతో గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మైహిపాల్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/వంట పనికు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం.జీ.20K.ఫోన్: 8977639662 / 8977639663 [H-796262]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గురుకులం.. కష్టాల నిలయం

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మైనార్టీ బాలుర పాఠశాల

- నీళ్లు లేక స్నానం చేయని విద్యార్థులు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, వసతిగది
- రూ.లక్షల్లో మాత్రం అద్దె చెల్లింపు
- పట్టించుకోని అధికారులు

పేద విద్యార్థుల కోసం ప్రభుత్వాలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. చిన్నగుండవెల్లి శివారులోని ఎల్లంకి కళాశాలకు చెందిన ఒక భవనంలో కొనసాగుతున్న సిద్దిపేట మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల దుస్థితి విద్యార్థుల పాలిట శాపంగా మారింది. కనీస వసతులు మొదలు.. శాశ్వత భవనం వరకు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చి 266 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి సరైన వసతులు, సౌకర్యాలు, నిర్వహణ లేకుండా పోవడంతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

– సిద్దిపేటరూరల్

ఎల్లంకి కళాశాల భవనాల్లో కేంద్రీయ విద్యాలయం, మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలతోపాటుగా సిద్దిపేటకు చెందిన మైనార్టీ గురుకుల పాఠశాల కొనసాగుతుంది. పాఠశాలకు చుట్టూ ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండాపోయింది. దీనికి తోడుగా సాయంత్రం సమయంలో విద్యార్థులు పాఠశాల ప్రాంగణం వదిలి బయటకు వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బట్టలు ఉతికిన అనంతరం


అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

విద్యార్థులు పక్కనే ఉన్న పొదల్లో ఆరేస్తున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యార్థులను చూసుకునేందుకు ఒక్కడే వాచ్‌మెన్ గార్డు ఉన్నారు.

వర్షాకాలంలో నీళ్లు భవనంలోకి..

మైనార్టీ గురుకుల పాఠశాల నిర్వహణలో భాగంగా భవనం యజమానికి నెలకు రూ.మూడున్నర లక్షలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. ఇవే డబ్బులతో భవనం నిర్మించినా అంత ఖర్చయ్యేది కాదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అద్దె భవనానికి సైతం కిటికీలు లేకపోవడంతో దోమలు రావడం, వర్షాకాలంలో నీళ్లు లోపలికి వచ్చి విద్యార్థుల బెడ్లు, బట్టలు తడుస్తున్నాయి. ఉదయం సమయంలో చల్లని నీళ్లతో స్నానం చేస్తున్నారు. మరుగుదొడ్లు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయి. డార్మెటరీ భవనంలో ఎలాంటి మెష్‌లు గాని లేకపోవడంతో అట్టముక్కలు, చెక్కల వంటివి అడ్డుపెట్టుకుంటున్నారు. ఈదురుగాలులకు చలికి నిద్రపోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యార్థులకు పూర్తి స్థాయిలో బుక్స్, యూనిఫాం నేటికీ అందుబాటులో లేవు. పాఠశాలలో ఇన్ని సమస్యలు ఉన్నా అధికారులు మాత్రం పర్యవేక్షణను మరచి చోద్యం చూస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కిటికీలకు మెష్‌లు లేకుండా ఉన్న దృశ్యం

4 రోజులుగా స్నానం లేక..

గురుకుల పాఠశాల భవనానికి చెందిన భూ యజమాని నుంచి పైపులైన్ ద్వారా నీళ్లను సరాఫరా చేస్తున్నారు. సుమారు అర కిలోమీటర్ నుంచి పాఠశాలకు పైపులైన్ ఏర్పాటు చేసి భవనం 3వ అంతస్తుపైన ఉన్న ట్యాంక్‌లోకి ఎక్కిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వరకు నాలుగు రోజుల పాటు పాఠశాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు మిషన్ భగీరథ ద్వారా వస్తున్న నీటితో కాళ్లు, చేతులు కడుక్కుంటూ నాలుగు రోజులుగా స్నానం చేయకుండా, బట్టలు ఉతుక్కోకుండా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం సమయంలో మరుగుదొడ్డికి వెళ్లేందుకు పాఠశాలకు సుదూరంలో ఉన్న ఓ నీటి కుంట వద్దకు వెళ్లి వస్తున్నారు. ఏళ్ల కొద్ది నీటి సమస్య వెంటాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.


అధ్వానంగా వసతి గది

చర్యలు తీసుకుంటున్నాం



ఇటీవల నీళ్లకు సంబంధించిన సమస్య ఎదురైన మాట వాస్తవమే. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడడం జరిగింది. పరిష్కారం కోసం స్పందించారు. బుధవారం నూతన బోర్‌మోటార్ కొనుగోలు చేశాం. ప్రస్తుతానికి పంపింగ్ చేస్తున్నాం. నీళ్ల అవసరం ఉన్న సమయంలో మిషన్ భగీరథ అధికారులకు విన్నవించడంతో నీళ్లు వదులుతున్నారు. ప్రతీ సంవత్సరం ఇదే సమస్య తలెత్తుతుందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– భానుప్రకాశ్,
మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు అవుతున్నా ఇప్పటివరకు మాటలు తప్ప చేతల్లో పనితనం చూపెట్టడం లేదన్నారు. ఇంతరవకు నాలుగు డీఏలకు గాను ఒక్కటి కూడా ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే చేతల్లోకి దిగి పెండింగ్‌లో ఉన్న డీఏలు అన్నింటిని చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మంచి పీఆర్సీతో ఉద్యోగుల ఆశలు నెరవేరుస్తామన్న ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు పీఆర్సీ ఇవ్వడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను నిర్వహించినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా మిగితా సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ శశికుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, జిల్లా కార్యదర్శులు లింగమూర్తి, వేణుగోపాల్, లోకేష్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాం రెడ్డి, జైపాల్ యాదవ్, రాములు, మల్లేశం, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు


సురేశ్ (ఫైల్)

చిన్నకోదూరు(సిద్దిపేట): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. చెర్లఅంకిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మోతకాని సురేశ్(35)కు భార్య రేణుక, కుమారుడు, కూతురు ఉన్నారు. సురేశ్ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల గ్రామంలోని ఎకరాని భూమి అమ్మాడు. అయినప్పటికీ అప్పులు ఉండటంతో మనస్తాపం చెంది గతనెల 31న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. మృతుడు సురేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సుమారు రూ. 20 లక్షల వరకు నష్టంపోయినట్లు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


కిరణ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లుపల్లి గ్రామానికి చెందిన చిటుకుల నర్సింహులు పెద్ద కుమార్తె ప్రవళికకి నిజామాబాద్‌కు చెందిన కిరణ్(40)తో వివాహమైంది. ఇల్లరికపు అల్లుడిగా ఉంటున్న కిరణ్, ప్రవళిక దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు రోజుల కిందట ఇంట్లో గొడవలు జరుగగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. శనివారం ఇంటికెళ్లిన కిరణ్ స్థానిక డంప్‌యార్డులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కిరణ్ ఆత్మహత్యపై అనుమానం ఉందని మృతుడి తల్లి రాణి, బంధువులు ఆరోపిస్తున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించొద్దని ఎస్పీని కలిసి కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి..


కనుకయ్య (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గురువన్నపేటలో చోటు చేసుకుంది. ఆదివారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి కనుకయ్య(49) 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ హస్మత్‌పేటలో పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఐదేళ్ల నుంచి బీపీ, షుగర్, అల్సర్, పక్షవాతంతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామమైన గురువన్నపేటకు వెళ్లి వస్తానని చెప్పి హైదరాబాద్ నుంచి వచ్చాడు. సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు సేవించగా స్థానికులు గమనించి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కమలహాసన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నీరేష్ కథనం మేరకు.. పట్టణ పరిధిలో చుంచనకోట రోడ్డులో నివాసముంటున్న తుమ్మలపల్లి లచ్చవ్వ ఇంట్లో 1వ తేదీన చోరీ జరిగింది. ఈ విషయమై బాధితులు మండలంలోని వీరన్నపేటకి చెందిన గీకురు అనిత అనే మహిళపై అనుమానం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీలో రూ.68 వేల విలువైన వెండి కడియాలు, పట్టగొలుసులు, బంగారు పుస్తెల తాడు పోయినట్లు పేర్కొంది. లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. మహిళతోపాటు ఆమెకు సహకరించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


నిజాంపేట(మెదక్): బంగారు పతకం, మెడల్స్‌తో విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ కనబర్చినట్లు రెంజుకి షాటోకాన్ వ్యవస్థాపకుడు కరాటే మాస్టర్ నగేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్ షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ వారు రెండవ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌ను మనోహరాబాద్‌లోని శ్రీ శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవాతోపాటు సుమారు 10 రాష్ట్రాల నుంచి 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు: కాటస్ విభాగంలో సాన్విక, సుహానిక, పృధ్వీక, జయశ్రీ, పూజిత, విస్మయ, సాన్వికరెడ్డి, హార్దిక్, మోక్షిత్, సుధానష్, క్రిష్, సాయిచరణ్, అంకిత్, సూరజ్, హనీష్కచారి, కనిష్క చారి,సహస్ర వర్మ, అజిత్ రాజ్, చైతన్య, అర్జున్, దేవాన్ష్, శబరిష్, రోషన్‌లు మొత్తం 27 బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి సినీ హీరో ఇంద్రసేన పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ దినాకర్, రియాజ్, విద్యాసాగర్, నిఖిల్, నిత్యస సిరి, అబ్దుల్లా, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): హైదరాబాద్ మొదటి జాతీయ స్థాయి సుబ్బు షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న జ్ఞాపకార్థం నిర్వహించిన కరాటే పోటీల్లో నిజాంపేట విద్యార్థులు బంగారు పతకం సాధించారు. దీనికి కృషి చేసిన కరాటే మాస్టర్ బ్లాక్ బెల్టు సంపత్ కుమార్‌ని గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరిప్రసాద్, నిజాంపేట గ్రామస్తులతోపాటు అధికారులు ప్రశంసించారు. భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెరువులో దూకి..


- జీవితంపై విరక్తితో బలవన్మరణం

పటాన్‌చెరు టౌన్: జీవితంపై విరక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయరావు కథనం మేరకు.. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన పాశం భాస్కర్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈనెల 1వ తేదీ ఉదయం డ్యూటీకి వెళ్తున్నాను అని చెప్పి బైక్‌పై హైటెక్ సిటీకి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాలేదు. దీంతో భార్య వందన, తల్లి చంద్రకళ ఫోన్ చేయగా తనకు పని ఉందని మరుసటి రోజు ఉదయం ఇంటికి వస్తానని చెప్పాడు. అనంతరం 2వ తేదీ ఉదయం తల్లి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు భాస్కర్ అదృశ్యంపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆదివారం అమీన్‌పూర్ పెద్ద చెరువులో భాస్కర్ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడికి తక్కువ జీతం ఉందని ఆర్థిక ఇబ్బందులతో తరచూ బాధపడుతూ ఉండేవాడని, ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి చెంది పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ వద్ద వివాదం

ఐదుగురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరుటౌన్: ఓ హోటల్ వద్ద కస్టమర్లకు, నిర్వాహకులకు జరిగి చిన్నపాటి వివాదం హత్యాయత్నం వరకూ వెళ్లింది. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులో ఉన్న పట్నం హైవే హోటల్‌లో భోజనం చేసేందుకు లక్దారం గ్రామానికి చెందిన కొంతమంది వచ్చారు. హోటల్లో చిరిగిపోయిన ప్లేటు ఇచ్చారని, ఆహారం చల్లారిపోయిందిన సర్వర్‌తో గొడవపడ్డారు. కుర్చీలు సైతం విరగొట్టారు. దీంతో రుద్రారం గ్రామానికి వంశీతోపాటు హోటల్ నిర్వాహకులు దాదాపు 15 మందికిపైగా వచ్చి లక్దారం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గ్రామస్తులపై కట్టెలతో, రాడ్‌లతో దాడిచేసి హత్యాయత్నానికి దిగారు. ఈ క్రమంలో జరిగిన దాడిలో లక్దారం గ్రామానికి చెందిన మాణిక్‌రెడ్డికి తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా మారింది. అలాగే గోవర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, నర్సింహాగౌడ్, రాజిరెడ్డిలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని సీఐ ప్రవీణ్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరనున్న తిప్పలు


సిద్ధం చేస్తున్న ఎంవీఐ కార్యాలయం

ఖేడ్‌లో ఎంవీఐ సేవలు

- తొలగనున్న లైసెన్స్, రిజిస్ట్రేషన్ ఇబ్బందులు
- ఏళ్ల కల నెరవేరుతున్న వేళ..

రవాణా శాఖ సేవలు స్థానికంగా లేకపోవడంతో ఖేడ్ ప్రాంత ప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర వాటి కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడేవారు. త్వరలో ఎంవీఐ సేవలు ఖేడ్‌లో అందుబాటులోకి రానుండటంతో ఇక్కట్లు తొలగనున్నాయి.

– నారాయణఖేడ్

జహీరాబాద్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)పరిధిలోకే నారాయణఖేడ్ నియోజకవర్గం వస్తుంది. డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నా.. కొత్త వెహికిల్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా.. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలన్నా ఖేడ్ ప్రాంతం వారు జహీరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఖేడ్‌కు జహీరాబాద్ 65కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఏ పని కావాలన్నా రెండు మూడు రోజులు తిరగాల్సి వస్తుంది. సమయం వృథా కావడం తోపాటు పనులు కూడా త్వరగా అయ్యేవి కావు. దీంతో చాలామంది డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ లేకుండానే వాహనాలు నడిపేవారు.

ఎట్టకేలకు అనుమతులు

ఖేడ్‌లోనే ఎంవీఐ సేవలు అందుబాటులోకి తేవాలని వాహనదారులు కొన్నేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వాహనదారుల ఇబ్బందులు ఎమ్మెల్యే వివరించారు. దీంతో స్పందించిన మంత్రి ఖేడ్‌లో వారంలో రెండు రోజుల పాటు ఎంవీఐ సేవలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చారు.

ప్రత్యేక కార్యాలయం

పట్టణంలోని రైతు బజారులో వృథాగా ఉన్న కార్యాలయ భవనాన్ని ఇటీవల జహీరాబాద్ ఎంవీఐ ఎం వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ పరిశీలించారు. భవనంలో మరమ్మతులతోపాటు, మురికి కాల్వపై కల్వర్టు నిర్మించాలని, ఓ వైపు నుంచి వాహనాలు వెళ్లి.. మరోవైపు నుంచి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారి సూచించారు. త్వరలో మరమ్మతు పనులు చేపడతామని వారు వివరించారు. ఈ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, రెన్యూవల్, వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, చలాన్ల చెల్లింపు, ఫిట్‌నెస్ తదితర సేవలు ఇక్కడే అందుబాటులోకి వస్తాయి. భారీ వాహనాలను సమీపంలోని తహసీల్ గ్రౌండ్‌లో చేపట్టనున్నారు.


తీరనున్న ఇబ్బందులు



ఖేడ్‌లోనే ఎంవీఐ సేవలు అందుబాటులోకి రావాలన్న కోరిక నెరవేరుతుంది. వాహనదారుల ఇబ్బందులపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టి సారించి సేవలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయడం సంతోషకరం. పట్టణ నడిబొడ్డులో కార్యాలయం ఏర్పాటు అవుతుంది.

– వీ.నరేందర్, వాహనదారుడు


త్వరలో కార్యాలయం ఏర్పాటు



వాహనదారులు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. ఎంవీఐ సేవలు ఖేడ్‌లో అందుబాటులోకి రావాలన్న ప్రజల కోరిక మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్య తీసుకెళ్లగానే ఖేడ్‌లో సేవలు కల్పించేందుకు వెంటనే స్పందించి రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఆదేశించారు. అతి త్వరలో ఖేడ్‌లో కార్యాలయం ఏర్పాటు అవుతుంది.

– డాక్టర్ సంజీవరెడ్డి,
నారాయణఖేడ్ ఎమ్మెల్యే

భవనంలో సదుపాయాలు



కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేయిస్తాం. భవనంలో సదుపాయాలు, మురుగు కాల్వపై కల్వర్టు నిర్మించాలని ఎంవీఐ సూచించారు. అందుకు అనుగుణంగా త్వరలో చర్యలు చేపడుతాం. అతి త్వరలో భవనం అందుబాటులోకి తెస్తాం.

– దారం శంకర్,
మున్సిపల్‌వైస్ చైర్మన్